# పుస్తకాలు అమ్మేవాడు

ఆ పుస్తకాలమ్మేవాడు రామవరప్పాడు స్టేషన్లో మా బండి ఎక్కాడు. బండి కదలగానే, ఒక మూల నిలబడి ఒక పుస్తకం తీసి "యం. ఏ. లు. బి. ఏ. లు. ప్యాసయినారు," అని పాడటం మొదలు పెట్టాడు. ఆ పాడే ధోరణిలో ఒక వింత ఆకర్షణవుంది. మా పెట్టె క్షణంలో నిశ్శబ్దపూరితమైంది. ఆ నిశ్శబ్దంలో ఖంగున వినిపించే వాని కంఠధ్వని ఎవర్ని ఆకర్షించదు ? నేను విననట్లు నటిస్తూ సావధానంగా వింటున్నాను.

"చెట్ల క్రింద ప్లీడర్లు
గట్లమీద ప్లీడర్లు
కల్లబొల్లి మాటలాయె
ఇల్లు వల్లు గుల్లలాయె !"

అని సాగించాడు. ఆ పాట సారాంశంయిది. ప్లీడరు పరీక్ష చదివి, ఇల్లుగుల్ల చేసి, ఎవ్వరింటికైనా చెక్క కొడతారు. ఇంటిదగ్గర 'భార్యాలలాము' పోరు పడలేక కోర్టుకి వెళ్తారు. అక్కడ 'బారు రూము'లో పడి నిద్రపోతారు. సాయకాలం అయిదింటికి ఆపసోపాలు పడుతూ కొంపకి చేరతారు. "మా ఆయన కష్టపడి వొచ్చాడమ్మా!" అని భార్య ఆదరిస్తుంది... ఇంటి ఖామందు అద్దె అడిగితే, ఆరునెల్ల నోటీసు ఇవ్వలేదు. నేను ఖాళీ చేయను, ఏమి చేసుకుంటావో చేసుకో" అంటారు. చేతిలో పడ్డవాళ్ళను పీల్చి పిప్పిచేస్తారు. తిరుక్షవరం చేసి

పంపుతారు—ఫ్యాషన్లకు మాత్రం తక్కువ ఉండదు. నోట్లో సిగరెట్లు, ప్రక్క క్రాఫింగులు మధ్యపాపట్లు—"

రైలు పెట్టెలోని జనమంతా నన్ను చూచి గొల్లున నవ్వారు. నా నోట్లో సిగరెట్టూ, నా మధ్యపాపటి, (బహుశా నా మొహం ప్లీడరు మొహంగా ఉంటుందేమో) - నా మొహం జేవురించింది. "ఆ క్లయింటు వెధవ చేశాడు. డబ్బులేదని మూడో క్లాసు టిక్కెట్టు కొన్నాడు, లేకపోతే నాతాతలనాడు ఎక్కారా, నా తండ్రులనాడు ఎక్కారా, ఈ మూడో తరగతి!" అని గొణుగుకొన్నాను. గబగబా కాగితాలు తీసుకొని ఏదో చదువుతున్నట్లు నటించాను.

పుస్తకాలమ్మేవాడు పాడుతూనే ఉన్నాడు. వాని మాటలు చెవుల్లో గింగురుమంటున్నవి. నా అదృష్టవశాత్తు వాడు ప్లీడర్ల అధ్యాయం ముగించి స్త్రీల అధ్యాయంలోకివచ్చాడు. నేను కాగితాలు అడ్డుపెట్టుకునే వింటున్నాను.

"చంక చేతుల జాకెట్లు
చంటిమెడల జాకెట్లు
ముక్కు పుడకలు మోటామె
వాలుచూపులు మెండామె!"

నేను ఆకర్షించబడ్డాను. అప్రయత్నంగా కాగితాలు మడిచి శ్రద్ధగా విన్నాను. "ఈ అధ్యాయం సారాంశంకూడా చెబుతాను. కుచద్వయం కనుపించే చేతులుగల జాకెట్లు—ఒక కుచం కనుపించేటట్లుగా రెండో కుచంమీదనుంచి పోయే పమిట..."

పెట్టెలోని జనమంతా సంతోషంతో విరగబడి నవ్వారు. కొందరు చిరునవ్వులతో గుసగుస లాడుకున్నారు. కొందరు "చూడు" అన్నట్లు కనుసైగలు చేసుకున్నారు. "బలే బాగుంది. అందులో ఒక్క అబద్ధంలేదు" అన్నారు కొందరు. ఒక ముసలివాడు తన్మయత్వంతో తలూపుతూ పుస్తకాలమ్మే వాడి పాటకు తాళం వేశాడు. "నాకొక పుస్తకం నాకొక పుస్తకం" అని ఆ పుస్తకాలన్నీ క్షణంలో కొని వేశారు. నా ప్రక్కన కూర్చొన్న హరిజన బాలిక భర్తతో, "ఒక పుస్తకంకొను, "పిచ్చాయికూడా చదువుకుంటాడు." అన్నది. అని వాడు రెండు పుస్తకాలు కొన్నాడు. నాకూడా ఒక పుస్తకం కొనాలనిపించింది, కాని నేను (ప్లీడర్ని, ఆర్టిస్టుని) ఈ అర్ధణా పుస్తకం, ఇటువంటి పుస్తకం కొంటుంటే ఎవ్వరయినా చూస్తే!... (వచ్చేటప్పుడు వీడు ఒంటరిగా కనబడితే తప్పకుండా కొనాలని నిశ్చయించుకున్నాను.)

ఇంతలో నేను దిగిపోవలసిన స్టేషన్ వచ్చింది. ఆ పుస్తకం సంగతే ఆలోచిస్తూ దిగాను. నా వెంటనే, నేను దిగిన పెట్టెలో నుంచే 20 సంవత్సరాల యువతి దిగింది. "ఈమె ఇందాకటి నుంచీ ఈ పెట్టెలోనే ఉందా!"అని నేను ప్రశ్నించుకున్నాను. ఆమె గబ గబా నా దగ్గరకు వచ్చింది.

"ఆ పుస్తకం కొనుక్కోరూ ?"

"ఏ పుస్తకం ?"

"రైలు పెట్టెలో అమ్మిన పుస్తకం."

"నా కెందుకు ?"

"చాటుగా చదువుకొని ఆనందించటానికి. ఇందాక వాడు చదివేటప్పుడు, అందరూ పరిహాసంగా నన్ను చూచి నవ్వేటప్పుడు, మీరు నోరు తెరుచుకొని ఆనందించారుగా!" అంది. వాడు వర్ణించిన స్త్రీ వేషం ఈమెకు సరిగ్గా అతికి పోయిందని అప్పుడు నేను గ్రహించాను. రైలులో జనము అంతగా ఎందుకు సంతోషించారో అప్పుడు నాకు అర్థము అయింది. పాపం, ఈ అమ్మాయి...

"అభిమానం లేకపోతేసరి, ఒక స్త్రీని పట్టుకొని అందులో భారత స్త్రీని, ఈ విధంగా ఇంతమంది పురుషులు పరిహసిస్తుంటే, నోరు తెరుచుకొని సంతోషించారు."

"నేనేం చెయ్యను ? నన్ను మాత్రం వాడు పరిహసించ లేదా ? మొదటి అధ్యాయమంతా నా జాతిని గురించేకదా! నేను ప్లీడర్ని."

"ఓహాో, మీరు ప్లీడర్లా !! ... అందుకనే మిమ్మల్ని పరిహసించినా, మీ దేశములోని ఒక అబలను పరిహసించినా గుటకలు మింగుతూ సంతోషించారు. ఏ తృణమో, పణమో వంకాయో, సొరకాయో, ముట్టజెపితే నా తరఫున వాగేవారు కాబోలు ! ...ప్లీడర్లు ! అనుకుంటూ పోయింది.

నాకు ఆశ్చర్యం వేసింది. పరిహసించటం, తప్పయితే ఎవ్వరిని పరిహసించినా తప్పే. 'పురుషుణ్ణి ఏమి చేసినా పరవాలేదు గాని స్త్రీని జాగ్రత్తగా వాడాలి, అనే వాదం నేను ఒప్పుకోను.

"అందులో నీ దేశం, అబలను." ఈ జాతీయ వాదం నన్ను ఎప్పుడూ ఆకర్షించలేదు. నన్ను ఒక్కటే ప్రశ్న బాధిస్తోంది. "స్త్రీ దర్జాలంటే ఇంత ఏవగింపు ఎందుకు? ఈమె నన్ను డబాయించే బదులు (స్త్రీ దర్జాని లోకువా) వాణ్ణే ఎందుకు డబాయించదు?"

❋

# పెద్దల సుద్దులు

"మన అయ్యవార్లంగారు అంత తెలివి గలవాడా అండీ. ఆయన కొడుకు వొట్టి దద్దమ్మగా తయారయ్యాడేమండీ?" అని అడిగాడు ఆంజయ్య.

కామావధాన్లు, జెండెం వేగంగా తిప్పుచూ, "అవునోయ్, మన పెద్దలు చెప్పనే చెప్పారు. పండిత పుత్రః పరమశుంఠః అన్నారు."

"అయితే మన శాస్త్రీగారి కొడుకు మాటేం చెపుతారు? తండ్రి కంటే గొప్ప వాడయ్యేటట్టున్నాడే!"

"అదీ మన పెద్దలే చెప్పారు. ఎక్కడున్నా పులికి పిల్లిపిల్ల పుడుతుందటోయ్." అన్నాడు కామావధాన్లు.

"అవునండి, అవును. మన పెద్దలు చెప్పందేముంది?" అని నాలిక మడత వేశాడు అంజయ్య.

---